క్లుప్తంగా

చల్లంగ చూడమ్మ చిన్నమ్మతల్లి



చిన్నమ్మతల్లి అమ్మవారి అనుపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రామభద్రపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి చిన్నమ్మతల్లి అమ్మవారి పండగ జాతర కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి బుధవారం ఉదయం 12 గంటల వరకు అమ్మవారిని తిరువీధి జరిపి వసంతుల వీధి రామమందిరం వద్ద అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అంజిలరథోత్సవం నిర్వహించి అనంతరం పలు సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహిస్తూ అమ్మవారిని భక్తి శ్రద్దలతో గుడి వద్దకు సాగనంపారు. మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగ చూడమ్మ చిన్నమ్మతల్లి అని కోరుకున్నారు.

పైడితల్లిని దర్శించుకున్న భక్తులు



క్యూలో భక్తులు

రాజాం : పట్టణంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఈ నెల 11తో ముగిసింది. కొండంపేట గ్రామానికి చెందిన లంకలపల్లి కుటుంబీకులు ఘటాలు సమర్పించడంతో జాతర ముగియగా, బుధవారం రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రతీ ఏడాది మంగళవారంతో జాతర ముగియగా, మరుసటి రోజున రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ఉద్యోగులు, భక్తులు కుటుంబ సమేతంగా యాత్రలో పాల్గొని, మొక్కులు చెల్లిస్తారు. స్థానిక భక్తుల రద్దీ కారణంగా ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

తెర్లాం: మండలంలోని అర్హులైన బీసీ కులాల వారంతా బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రేగి రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రుణాల మంజూరు కోసం ఈ నెల 22లోగా దరఖాస్తులను స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయంలోగానీ, మీసేవా, ఇంటర్నెట్ కేంద్రాల్లోగానీ చేసుకోవాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం అర్హులైన వారంతా వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని చెప్పారు.

సీసీ డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన



సీసీ డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఈ

రాజాం : పట్టణంలో ఎల్ఐసీ బిల్డింగ్ వార్డులో ప్రశాంతి నగర్ అనుసంధాన రోడ్డులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను మున్సిపల్ ఏఈ వెంకట్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ కొలతలపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ.2.75 లక్షల అంచనా వ్యయంతో 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నామని మున్సిపల్ ఏఈ తెలిపారు.

రాష్ట్ర వ్యాప్త నిరసనకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

సంతకవిటి: పశు సంవర్ధక శాఖ సహాయకులకు పనిభారం తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసనకు సిద్ధమని డెమోక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి కిరణ్‌కుమార్ అన్నారు. సంతకవిటిలో ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ సహాయకులు జీవాల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సర్వేల బాధ్యత అప్పగించి అదనపు భారం మోపడం సరికాదన్నారు. దీనిపై సచివాలయ శాఖ మంత్రికి పలుసార్లు విన్నవించినట్టు తెలిపారు. ఆయన వెంట ఏహెచ్ఏలు సంతోష్, వెంకటేష్, రమణకుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిన శ్రేణులు

బాడంగి: విజయనగరం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి శంబంగి వెంకటచినఅప్పలనాయుడు నాయకత్వంలో పార్టీ నేతలు బేతనపల్లి శంకరరావు, తెంటు తిరుపతిరావు, కండి సురేష్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, మరిపి శంకరరావు, యామల శివప్రసాదరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువత తరలి వెళ్లారు.

అన్ని వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నేతలు



రాజాం సిటీ: పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నేతలు



రాజాం సిటీ: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



తెర్లాం: రాజయ్యపేటలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



రామభద్రపురం: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

రాజాం సిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పని చేసిందని, పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద బుధవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం మాధవబజార్ జంక్షన్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం పరితపించే నాయకుడని, అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ప్రజాపక్షమేనని అన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు పార్టీ తరఫున ప్రతి ఒక్కరు సమాయత్తం కావాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దూబ గోపాలం, ముద్దన సత్యారావు, శాసపు వేణుగోపాలనాయుడు, పాలవలస శ్యాంసుందర్, ఆశపు సూర్యం, గోకవలస బాబూరావు, చిన్నా, గార సత్యనారాయణ, కెంబూరు నారాయణరావు, సలాది సతీష్, చల్లా జయరాం, త్రినాధ, అల్లెన జయలక్ష్మి, కోలా రమ్య, కోరాడ రామినాయుడు, పి.రాంబాబు, శ్రీనివాసరావు, తవుడు తదితరులతో పాటు పట్టణ, రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీతోనే పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసిన మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడుకు తినిపించారు. అనంతరం ఇతర నాయకులకు, పార్టీ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాల రావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీ కృష్ణ, రమాదేవి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్‌అన్వర్ భాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో పార్టీ విర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖండ్యాంలో మహారుద్ర యాగం



రేగిడి మండలం ఖండ్యాం గ్రామంలో ఉమాకాశీ విశ్వేశ్వర పంచాయతన దేవాలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మహారుద్ర యాగాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మంతా చిన్నక్రిష్ణమూర్తిశర్మ, సరోజ దంపతులచే ఈ యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. 60 మంది దంపతులచే విఘ్నేశ్వర పూజ ప్రారంభించి, మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహణకు యజ్ఞకర్త అంపోలు రుద్రకోటేశ్వర శర్మ తెలిపారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంపోలు రామ్‌ప్రసాద్‌శర్మ, రుత్విక్‌లు పాల్గొన్నారు. - రేగిడి

రీసర్వేపై అవగాహన ర్యాలీ



రైతులు తమ భూ సమస్యల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జేవీవీఎస్ రామ్మోహనరావు సూచించారు. బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. అనంతరం రీసర్వేకు సంబంధించి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీను, డీటీ శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు. - బొబ్బిలి రూరల్

మండల సమావేశం రేపు

సంతకవిటి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 14న ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన జరగనున్నట్టు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో కాలు విరిగిపోయిన ఎం.ఆర్ అగ్రహారానికి చెందిన గుంట లింగమూర్తి

తెర్లాం: రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, మరొక వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం తెర్లాం జంక్షన్ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన గుంట లింగమూర్తి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపైనా, రాజాం మండలం కంచరాం, ఇల్లంనాయుడువలస గ్రామాలకు చెందిన దాలిశెట్టి గోపి, సామంతల రమణలు మోటార్ సైకిళ్లపై తెర్లాం జంక్షన్ వైపు వస్తున్నారు. ఈ రెండు వాహనాలు తెర్లాం జంక్షన్ సమీపంలో ఒకదానికి ఒకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎం.ఆర్ అగ్రహానికి చెందిన గుంట లింగమూర్తి, కంచరాంకు చెందిన దాలిశెట్టి గోపిలకు కుడికాళ్లు విరిగిపోయాయి. ఇల్లంనాయుడువలసకు చెందిన సామంతల రమణకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక 108 వాహనానికి సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి బాధితులకు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు.

19న పూజా సామగ్రి విక్రయానికి వేలం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతి దేవి ఆలయంలో పూజాసామగ్రి విక్రయానికి ఈ నెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఈఓ పి.శ్యామలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద పూజా సామగ్రి సెట్లు, పుస్తకాలు, రక్షాబంధనములు, అమ్మవారి లేమినేషన్ ఫొటోలు అమ్ముకునేందుకు హక్కుగా ఈ వేలం ఉంటుందని అన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ. 25వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని అన్నారు. అధిక మొత్తంలో పాట దక్కించుకున్నవారిని అర్హులుగా ప్రకటించి మిగిలిన వారికి డిపాజిట్ సొమ్మును వాపసు చేయనున్నామని పేర్కొన్నారు. పాట దక్కించుకున్నవారు ఈ నెల 30 నుంచి 2027 మార్చి 29 వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆలయం వద్ద సంప్రదించాలని సూచించారు.

ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్: ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ జేవీవీ రామ్మోహనరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హత ఉంటూ ఇంతవరకు ఇళ్ల స్థలాలను పొందలేని వారితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న లబ్ధిదారులు అర్హులుగా గుర్తిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలను కేటాయిస్తామని వివరించారు. ఏపీఐఐసీ, దాతల ద్వారా సేకరించిన, గ్రామ కంఠం భూములను గుర్తించి అందజేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన స్థలాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో తహసీల్దార్ ఎం.శ్రీను ఉన్నారు.

కంటి కణాలను దెబ్బతీయక ముందే చికిత్స అవసరం

- జాతీయ స్థాయి నేత్ర వైద్య నిపుణుడు కేవీ అప్పారావు

బొబ్బిలి: కంటిలో నీటి సంచులు ఏర్పడి అవి కంటి కణాలను దెబ్బతీయక ముందే వైద్య చికిత్సలు అందించాల్సిన వ్యాధి గ్లకోమా వ్యాధి అని దీనిని నిర్లక్ష్యం చేయకుండా కంటి చూపును కాపాడుకోవాల్సి ఉంటుందని ప్రముఖ జాతీయ స్థాయి నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ కేవీ అప్పారావు అన్నారు. బొబ్బిలి కంటి ఆస్పత్రిలో గ్లకోమా వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో చెన్నై, హైద్రాబాద్, ముంబయి, చండీఘర్, బెంగళూరు తదితర ప్రాంతాల కన్నా ఎక్కువ చికిత్సలు జరిగింది బొబ్బిలిలో కావడం విశేషమన్నారు. గుండెలాగానే కంటికి కూడా బైపాస్ చికిత్స చేసేదే గ్లకోమా చికిత్స అన్నారు. ఈ సందర్భంగా అత్యధిక చికిత్సలు చేసి జాతీయ స్థాయిలో పేరొందిన డాక్టర్ కేవీ అప్పారావును స్థానిక వైద్యులు, సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘన సత్కారం చేశారు. సదస్సులో గ్లకోమా పరిశోధనలో పాలుపంచుకుంటున్న అబివిక్ కంపెనీ ప్రతినిధులు నక్షత్ర శ్రీనివాస్ అయ్యప్పన్, వి.శ్రీనివాస్, గెంబలి శ్రీనివాసరావు, శ్రీహరి, కృష్ణ మోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ దగ్గర ఆంజనేయ స్వామి గుడి వద్ద చేపల వ్యానును ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనలో నారాయణప్పవలసకు చెందిన గేదెల శంకర రావు అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై తన భార్య బంటు లక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తీసుకుని మండల పరిషత్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా పార్వతీపురం వెళ్తున్న చేపల వ్యాను కిందికి దూరిపోయాడు. దీంతో శంకరరావుకు ఎడమ చేయి, ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

బొబ్బిలి రూరల్: మండలంలోని పంచాయితీల్లో వీధిలైట్లు, తాగునీటి బోర్ల నిర్వహణకు సంబంధించి విద్యుత్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని ట్రాన్స్‌కో జేసీ సోమేశ్వర్రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎంపీడీఓ పి.రవి కుమార్‌కు తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓను కలసి వివరాలు సమర్పించారు. 30 పంచాయితీల్లోను దాదాపు రూ.71 లక్షల విద్యుత్ బకాయిలున్నాయని వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. కాగా తాగునీటి బోర్లకు సంబంధించిన బిల్లులు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు చెల్లించాల్సి ఉంటుందని, పంచాయితీల బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్తంగా..

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, లేకుంటే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ త్రినాధరావు అన్నారు. మండలంలోని వి.చిన్నయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూను, మరుగుదొడ్లను, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, ఉపాధ్యాయుల లెసన్ ప్లానింగ్, డైరీలను పరిశీలించారు.

నేత్ర పరీక్షలు

తెర్లాం: ముందస్తు నేత్ర పరీక్షలతో కంటి దృష్టిని కాపాడుకోవచ్చని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.వెంకటేష్ అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో పెరుమాళి పీహెచ్‌సీలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన కంటి రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు కంటి పరీక్షలు చేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగుదలకు కృషి

రేగిడి : ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ 2 బి.ఎరకయ్య సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలో అన్ని పాఠశాలల స్థాయి హెచ్ఎంలకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరకయ్య మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణత ప్రతీ తరగతిలో సాధించాలని వెల్లడించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో పనులు జరగాలి

రేగిడి : మండలంలో 39 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు జరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఏపీఓ ఎస్.హరనాధరావు సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు సంబంధించి మెట్టు ప్రాంతాల్లో ఉన్న తోటలు, పండ్ల తోటలు నిర్మాణంలో ఈ పనులు వినియోగపడేలా చూడాలని వెల్లడించారు. ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఆయా పంచాయతీల్లో పనులు ప్రారంభించి, అందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు.

పాడి ఆవులు సంరక్షించుకోవాలి

రేగిడి : రైతులు పాడి ఆవులు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలో అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లో పాడి పరిశ్రమకు సంబంధించి వైద్యశిబిరాలు బుధవారం నిర్వహించారు. పాల ఉత్పత్తి పెరగాలంటే పశుగ్రాసాన్ని రైతులు పెంచి, పాడి ఆవులకు పశుగ్రాసం కొరత లేకుండా చేయాలని అన్నారు. సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

రేగిడి : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వాహన చోదకులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై రేగిడి ఎస్ఐ నీలావతి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ చేయాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు, పెద్దపెద్ద వాహనాల డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. సురక్షిత ప్రయాణాన్ని లక్ష్యంగా బాధ్యత తీసుకోవాలని అన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు

రాజాం : మండలంలో లక్ష్యానికి దగ్గర్లో ఫారం పాండ్లు నిర్మాణం జరుగుతోందని ఉపాధి పథకం ఏపీఓ సాయిరాం అన్నారు. మండలంలోని నందబలగ గ్రామంలో ఫారం పాండ్లు నిర్మాణాన్ని పరిశీలించారు. కొలతల ప్రకారం వీటిని నిర్మించుకోవాలని వెల్లడించారు. నిర్మాణాలు ఆధారంగా రూ.17వేలు వరకూ ఉపాధి నిధులు పొందే అవకాశం ఉందని తెలిపారు. వీటి నిర్మాణంతో సాగునీటి సమస్యకు చెక్ పెట్టవచ్చునని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మార్చి నెలలో 50 ఫారం పాండ్లు తవ్వాల్సి ఉండగా, 38 నిర్మాణాలు పూర్తయ్యేందుకు సిద్ధమయ్యాయని అన్నారు. మరో 12 నిర్మాణాలు ఈ నెలాఖరులోగా చేస్తామని తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం

బాడంగి: ఇళ్లు మంజూరై ఆర్థిక స్తోమత లేక మధ్యలో నిలిపివేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం కొత్తగా రుణం మంజూరు చేసి అదనపు సాయం అందించేందుకు జీఓ జారీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇందుకోసం లబ్ధిదారులు సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుల ద్వారా గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. మండలంలో ఇటువంటి లబ్ధిదారులు 89 మంది ఉన్నట్టు సర్వేలో తేలిందన్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో కంటి పరీక్షలు

రాజాం సిటీ: ప్రతి ఒక్కరు సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని రొటేరియన్, ఆఫ్తాల్మిక్ అధికారి సప్పటి వసంతరావు అన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్లకోమా వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలి రూరల్: మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవి కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని అన్నీ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా అగ్నిగంగమ్మ జాతర

వంగర: మండల పరిధి కొప్పర గ్రామంలో అగ్నిగంగమ్మ జాతర ఘనంగా జరిగింది. గ్రామంలో భక్తులు ఘటాలతో ఊరేగింపు చేపట్టగా, మరికొంత మంది భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్ని నిప్పులు తొక్కారు. అనంతరం జరిగిన జాతరకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

సంతకవిటి: మండలంలోని నారాయనపురం ఆనకట్టలో జైకా నిధులతో దాదాపు రూ.35లక్షల వ్యయంలో జరుగుతున్న హెడ్ స్లూయిస్ మార్పిడి పనులను బుధవారం ఏఈఈ రాంబాబు పరిశీలించారు. కుడి ప్రధాన కాలువకు నీటిని మళ్లించే పాత హెడ్ స్లూయిస్‌ను తొలగించి నాణ్యతతో కూడిన కొత్త హెడ్ స్లూయిస్‌లను త్వరితగతిన అమర్చాలని కాంట్రాక్టర్ భాషాకు సూచించారు.

పనిముట్లతో పనికి రావాలి

సంతకవిటి: ఉపాధి హామీ పనులకు వచ్చే వేతనదారులు పనిముట్లతో పనికి రావాలని ఏపీఓ ఆర్.హరనాధరావు కోరారు. మోదుగులపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఎండలు అధికంగా ఉండడం వలన ప్రతి ఒక్కరూ తాగునీరు వెంట తీసుకురావాలని సూచించారు.

పరదేశమ్మ, పోలమ్మతల్లి ఘటాల తిరువీధి

బాడంగి: బాడంగి గ్రామదేవతలు పరదేశమ్మ, పోలమ్మతల్లి ఘటాలు, పాలజంగిడి బుధవారం రెండోరోజు గ్రామంలో తిరువీధి చేపట్టారు. తొలుత అమ్మవారి గద్దెనుంచి ఘటాలను బయటకు తెచ్చి గ్రామ పురవీధులలో తిరువీధి చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని కాశిందొరవలస పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఫారం పాండ్ పనులను తనిఖీ చేసిన ఆయన వేతనదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ అల్లు భాస్కర రావు, ఏపీఓ లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.